సాక్షి
పల్నాడు
శనివారం । 31 । ఆగస్టు । 2024




కోదండరాముడికి పూజలు

నాదెండ్ల: గణపవరం గ్రామంలోని కోదండ రామాలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు.



వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

దాచేపల్లి: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు చేసి సారె సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 6034 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 170 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

నూరు శాతం పింఛన్ల పంపిణీ జరగాలి

జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు

నరసరావుపేట: సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడం వలన జిల్లాలో ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ చేయడం జరుగుతోందని, శనివారం ఉదయానికే నూరు శాతం పింఛన్ల పంపిణీ జరగాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేక అధికారులతో పింఛన్ పంపిణీపై సమీక్షించారు. ఉదయం ఆరు గంటలలోపే పంపిణీ ప్రారంభం కావాలని అన్నారు. పింఛన్ శనివారమే అందిస్తున్నట్లు గ్రామాల్లో శుక్రవారం రాత్రికే టామ్ టామ్ వేయాలని, ఎవరైనా గ్రామాల్లో లేని వారుంటే రెండో తేదీన పింఛన్ అందించాలని స్పష్టం చేశారు.

జిల్లాలో 24.808 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంలో జిల్లాలో ఉన్న రెండు ఇసుక స్టాక్ యార్డులైన మాదిపాడులో ఒక టన్ను రూ.192లకు, కొండమోడులో టన్ను రూ.564లకు సరఫరా చేయబడుతుందని జిల్లా భూగర్భగనుల అధికారి నాగిని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ నాటికి రెండు స్టాక్ యార్డుల నుంచి 25,333.3 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేయటం జరిగిందన్నారు. బుకింగ్ ఇన్‌వాయిస్‌లతో మాత్రమే వాహనాలను అనుమతించటం జరుగుతుందని అన్నారు. శుక్రవారం ఇసుక కోసం 27 మందికి 525 మెట్రిక్ టన్నులు బుకింగ్ చేయటం జరిగిందన్నారు. స్టాక్ యార్డుల్లో 24,808 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు.

విజయకీలాద్రిపై శ్రావణ శుక్రవారం పూజలు



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు అష్టలక్ష్మీ అమ్మవార్ల తిరుమంజన సేవ, అలంకరణ, అష్టోత్తర శతనామార్చన, అష్టైశ్వర ప్రాప్తికి శ్రీ సూక్త హవనం కార్యక్రమాల్ని అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం సహస్ర బిల్వార్చన, కదంబ పుష్పాలంకరణ, నివేదన, నక్షత్ర హారతి కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో అష్టలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.5 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి శుక్రవారం పలువురు భక్తులు విరాళాలను ఇచ్చారు. గుంటూరు బ్రాడీపేటకు చెందిన దాసరి కస్తూరి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చింది. ఆలయ ఈవో కె.ఎస్.రామారావును కలిసి రూ.5 లక్షలను అందజేసింది. విజయవాడ కొత్తపేటకు చెందిన చక్రాతి చెన్నకేశవరావు కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఈవో కె.ఎస్.రామరావు, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రావణ శుక్రవారం సందర్భంగా వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజ సామగ్రిని ఆలయం ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమాన్ని ఈవో ఏ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. పట్టణంలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులోని శ్రీ కాళికామాత ఆలయం, పాత మంగళగిరి బైపాస్ రోడ్డులోని కనకదుర్గ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.



కోల్‌కతా దుర్ఘటన బాధాకరం

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హాస్పిటల్‌లో ఒక ట్రైనీ మహిళా పీజీ విద్యార్థినిపై జరిగిన దారుణానికి సభ్యసమాజం సిగ్గుపడాలి. దీనికి కారణం ఆ మెడికల్ కళాశాలలో భద్రతా ఏర్పాట్లు, డాక్టర్లకు సరైన సదుపాయాలు లేకపోవటమే కారణం. దీనిని చూసైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. గట్టి చట్టాలు, శిక్షలు అమలు, సొకర్యాలపై దృష్టి సారించి డాక్టర్లకు తగిన రక్షణ కల్పించకపోతే స్వేచ్ఛగా వైద్యసేవలు అందజేయటం కష్టం.

-డాక్టర్ ఎం.చెంచిరెడ్డి, ఆప్తమాలజిస్టు,
డాక్టర్ రామలింగారెడ్డి మాక్సివిజన్ కంటి హాస్పిటల్, నరసరావుపేట



మహిళా డాక్టర్లకు ప్రత్యేక భద్రత కల్పించాలి

ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటల్స్‌లో పనిచేసే మహిళా డాక్టర్లకు ప్రత్యేక భద్రతా చర్యలు, సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకత కోల్‌కతా ఆర్‌జీ కర్ ఉదంతం తెలియచేస్తుంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో వైద్యరంగానికి నిధులు పెంచి తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలి. తగిన భద్రత ఉంటేనే పేషెంట్లకు న్యాయం చేయగలుగుతారు. ఈ లాజిక్ మిస్‌కావటం బాధాకరం.

-డాక్టర్ ఎం.శాంతిశ్రీ, ఆప్తమాలజిస్టు,
డాక్టర్ రామలింగారెడ్డి మాక్సివిజన్ కంటి హాస్పిటల్, నరసరావుపేట



పింఛన్లకు కోత

"మేము అధికారంలోకి రాగానే పింఛన్ రూ.నాలుగు వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో పింఛన్‌దారులంతా మురిసిపోయారు. అధికారంలోకి రాగానే మీకు పింఛన్ ఎందుకు రద్దు చేయకూడదంటూ తాఖీదులు ఇచ్చారు. తాఖీదులు అందుకున్న అవ్వాతాతలు బిక్కమొహం వేశారు. చివరకు జిల్లాలో 4,842 పింఛన్లకు కోత పెట్టారు."

- మూడు నెలల్లో 4,842 పింఛన్ల తగ్గింపు
- నెలవారీ తగ్గుతున్న పింఛన్ల సంఖ్య
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే కారణంతో అందజేయని పింఛన్లు

కూటమి ప్రభుత్వం కుట్ర



తమకు వచ్చిన నోటీసులపై ఈనెల 19న కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామస్తులు

నరసరావుపేట: అధికార తెలుగుదేశం కూటమి ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్లను క్రమంగా తగ్గిస్తుంది. గడిచిన మూడు నెలల కాలంలో జిల్లాలో లబ్ధిదారులకు మంజూరైన పింఛన్ల సంఖ్యను పరిశీలిస్తే ఈ నిజం బోధపడుతుంది. జూన్ 12వ తేదీన కూటమి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేశారు. జూన్‌కు సంబంధించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకే పింఛన్ సొమ్ము మంజూరైంది. నూతన ప్రభుత్వం జూలై మాసానికి జిల్లాలో 2,82,126మందికి అన్ని రకాల పింఛన్లు పెంచి అందజేస్తున్నట్లు ప్రకటించింది. మూడో నెల సెప్టెంబరు వచ్చేసరికి ఆ సంఖ్య 2,77,284కి కుచించుకుపోయింది. అంటే మూడు నెలల వ్యవధిలోనే సుమారుగా 4,842 మంది పింఛన్‌దారులు తగ్గిపోయారు. వీరిలో కొంతమంది చనిపోయారనుకున్నా అంత మంది తగ్గే అవకాశం లేదనేది విజ్ఞుల వాదన. వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం మండలంలోని కొన్ని గ్రామాలకు చెందిన 209 మంది లబ్ధిదారులకు మీకు పింఛన్ ఎందుకు రద్దుచేయకూడదంటూ ఎంపీడీవోలు తాఖీదులు అందజేశారు. దీనిపై ఈనెల 19వ తేదీ సోమవారం ఆ మండలంలోని పిచికలపాలెంకు చెందిన కొంతమంది బడుగు బలహీన వర్గాల వారు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికకు హాజరై తాము ఎంతో కాలంగా పింఛన్లు పొందుతున్నామని, తమకు నోటీసులు అందజేశారని, పింఛన్లు కొనసాగించాలంటూ కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. మరికొన్ని చోట్ల వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే కారణాలతో వారికి పింఛన్లు నిలుపుదల చేశారు. దీనిపై కొంతమంది కోర్టును కూడా ఆశ్రయించినట్లు సమాచారం. కాగా, పింఛన్ల తగ్గుదలపై వివరణ కోరేందుకు డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. వరుసగా జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వారీగా పింఛన్లు పొందిన లబ్ధిదారుల సంఖ్యా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పింఛన్ల తగ్గింపు ఇలా..

నియోజకవర్గం	జూలై	ఆగస్టు	సెప్టెంబరు
చిలకలూరిపేట	37,982	37,453	37,337
గురజాల	44026	43,356	43,225
మాచర్ల	43,520	42,917	42,755
నరసరావుపేట	33,622	33,202	33,076
పెదకూరపాడు	40,264	39,731	39,589
సత్తెనపల్లి	40,559	39,968	39,856
వినుకొండ	42,153	41,586	41,446
మొత్తం	2,82,126	2,78,213	2,77,284

220 మంది దివ్యాంగులకు నోటీసులు

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో 220 మంది దివ్యాంగ పింఛన్‌దారులకు సదరం సర్టిఫికెట్స్ రీ వెరిఫికేషన్ పేరిట నోటీసులు జారీ చేశారు. దీంతో సామాజిక భద్రత పింఛన్‌లు పొందుతున్న దివ్యాంగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్ధలపూడి వాసు అనే పేరుతో కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు రీ వెరిఫికేషన్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఆ పేరుతో ఉన్న వ్యక్తులు గ్రామంలో లేరని తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో షేక్ గౌసియా బేగం వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో పింఛన్ పొందుతున్న 220 మంది దివ్యాంగులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వెరిఫికేషన్ అనంతరం సెప్టెంబరు నెల పింఛన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆగస్టు నెల పింఛన్ కూడా అందజేస్తామని తెలిపారు.

సింగిల్ విండో యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



కేసుల వివరాలు పరిశీలిస్తున్న ఎస్పీ

శావల్యాపురం: వినాయక చవితి విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్పీ ఆకస్మికంగా శావల్యాపురం పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయటానికి సింగిల్ విండో యాప్‌ను అమలు చేసిందన్నారు. విగ్రహాలు ఏర్పాటుచేసే కమిటీలు యాప్‌ను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. శాంతిభద్రతల సమస్య ఉన్న గ్రామాల్లో పోలీసు అధికారులతో సమీక్షించి అనంతరం విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు జారీ చేస్తామన్నారు. ఇళ్ల బయట పార్కింగ్ చేస్తున్న బైకులు అపహరణకు గురవుతున్నాయని విలేకరులు ఎస్పీ దృష్టికి తేగా ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడలి మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. కారుమంచి, వేల్పూరు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ లోకేష్‌రావును ఆదేశించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. కేసుల సమగ్ర వివరాలు కంప్యూటర్‌లో పరిశీలించారు. పట్టణ సీఐ శోభన్‌బాబు ఉన్నారు.

సీఎం పర్యటన రద్దు

వర్షం కారణంగా నిలిచిన వనమహోత్సవం



సభావేదిక వద్ద నిలిచిన వర్షపునీటిని బకెట్లతో తోడుతున్న సిబ్బంది

సాక్షి, నరసరావుపేట: వన మహోత్సవం పేరిట రాష్ట్ర ప్రభుత్వం కోటి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభోత్సవానికి శుక్రవారం నరసరావుపేటకు రావాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంల పర్యటన రద్దు అయ్యింది. గురువారం రాత్రి నుంచి అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో సీఎం పర్యటన నిలిచిపోయింది. కార్యక్రమం జరిగే జేఎన్‌టీయూ కళాశాల మైదానం మొత్తం శుక్రవారం తెల్లవారుజామునకే వర్షపు నీటితో తడిసిముద్దయ్యింది. వర్షం అంతటితో ఆగితే పర్యటన సాగుతుందని అధికారులు భావించారు. ఆ దిశగా వర్షపునీటితో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అయితే వర్షం ఎడతెరిపి లేకుండా మధ్యాహ్నం దాకా పడటంతో చివరి నిమిషంలో పర్యటన రద్దయ్యింది. వాతావరణం అనుకూలించకపోవడంతో సీఎం రోడ్డు మార్గంలో వస్తారంటూ ప్రచారం జరిగినప్పటికి జేఎన్‌టీయూ ప్రాంగణంలో నీరు ఇంకపోవడంతో కార్యక్రమ నిర్వహణ ఇబ్బందిగా మారింది. వర్షాకాలం, పైగా అల్పపీడన ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ సమాచారం ఉన్నప్పటికి చౌడునేల అయిన జేఎన్‌టీయూ కళాశాలలో సీఎం ప్రోగ్రాం నిర్వహించాలని జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవడం పట్ల కూటమి నేతలు పెదవివిరుస్తున్నారు. కనీసం అవగాహన లేకుండా అక్కడ నిర్వహించడం సరికాదంటున్నారు. మరోవైపు సీఎం, డిప్యూటీ సీఎంల పర్యటన నేపథ్యంలో మూడు రోజులుగా జిల్లా అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్లు, పడిన శ్రమ వృథా అయ్యింది. సీఎం పర్యటన నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు వారికి కేటాయించిన స్థానాల్లో వర్షంలోనే విధులు నిర్వహించారు.



భ్రమరాంబకు లక్ష గాజులతో ప్రత్యేక అలంకరణ

పెదకాకాని: శ్రావణ మాస చివరి శుక్రవారం సందర్భంగా పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో సామూహిక వరలక్ష్మి వ్రతాల్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని లక్ష గాజులతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ స్థానాచార్యులు పాత్తూరి సాంబశివరావు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించినట్లు ఈవో డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. వ్రతంలో పాల్గొన్న ముత్తయిదువులకు దేవస్థానం పసుపు కుంకుమ, జాకెట్ ముక్క, అష్టలక్ష్మి దేవి రూపు, కంకణాన్ని అమ్మవారి అందజేశారు.

విస్తారంగా వర్షాలు

- అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ముసురు
- ఖరీఫ్ పంటలకు ఉపయోగకరం
- ఆగస్టులో సాధారణ వర్షపాతం కన్నా తక్కువ నమోదు
- తీవ్ర ఎండలకు ఎండిన పత్తి, అపరాల పంటలు
- వర్షాలతో కోలుకోనున్న పంటలు
- మిర్చి, పొగాకు సాగుకు మేలు అంటున్న వ్యవసాయశాఖ అధికారులు



వినుకొండ వీధుల్లో పారుతున్న వర్షపు నీరు

సాక్షి, నరసరావుపేట: అల్పపీడన ప్రభావంతో పల్నాడు జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. పలు మండలాల్లో శుక్రవారం మొత్తం ఎడతెరిపి లేకుండా ఓ మోస్తారు చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు బయటకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. వర్షాల కారణంగా నరసరావుపేటలో సీఎం, డిప్యూటీ సీఎంల పర్యటన రద్దు అయిన విషయం తెలిసిందే. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం విశాఖపట్నం వద్ద తీరం దాటి సెప్టెంబర్ 2వ తేదీ నాటికి వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ అంచనా వేసింది. దీంతో జిల్లాలో మరో రెండు మూడు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలలో నీరు నిలుస్తోంది. మరోవైపు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సాగు వేగం పుంజుకోనుంది. సాధారణ లక్ష్యం 2,48,350 హెక్టార్లు కాగా ప్రస్తుతం సుమారు 65 వేల హెక్టార్లు సాగులోకి వచ్చింది. వర్షాలు కురుస్తుండడం, సాగర్‌లో నీరు పూర్తిస్థాయిలో ఉండి క్రస్ట్‌గేట్ల ద్వారా కిందకు వదులుతున్న నేపథ్యంలో కుడికాలువకు సమృద్ధిగా నీటిని వదిలే అవకాశం ఉంది. దీంతో పంటల సాగు ఆశాజనకంగా ఉండనుంది.

ఎండిన పత్తి పంటకు ఊతం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు అపరాలు, మిర్చి, పొగాకు పంటల సాగు పనులు చేపట్టనున్నారు. మరోవైపు జిల్లాలో ఇప్పటికే సుమారు 50 వేల హెక్టార్లలో సాగు చేసిన పత్తి పంట కొన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయాయి. జిల్లాలో జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం కన్నా అధికంగా వర్షాలు కురిసినా, ఆగస్టు నెలలో ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 140 మి.మీ సాధారణ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా కేవలం 96 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. దీంతో గురజాల, కారంపూడి, క్రోసూరు, మాచవరం, నరసరావుపేట తదితర మండలాల్లో పంటలు వాడుపట్టాయి. గురువారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పత్తి, మిర్చి, అపరాల పంటలు కోలుకునే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ వర్షాలు నాలుగైదు రోజులు కొనసాగితే తప్ప ఇబ్బంది లేదంటున్నారు.

జిల్లాలో 368.6 మి.మీ వర్షపాతం నమోదు :మాచర్లలో అత్యధికం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24గంటల వ్యవధిలో 368.6 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలోని 28 మండలాల్లో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం నమోదుకావటం విశేషం. మండలాలవారీగా పరిశీలిస్తే..మాచర్లలో 42.0 మి.మీ, వెల్దుర్తిలో 24.6, దుర్గిలో 25.8, రెంటచింతలలో 26.4, గురజాలలో 32.4, దాచేపల్లిలో 17.4 మి.మీ వర్షం పడింది. అలాగే కారంపూడిలో 22.4, పిడుగురాళ్లలో 22.6, మాచవరంలో 5.2, బెల్లంకొండలో 4.4, అచ్చంపేటలో 6.6, క్రోసూరులో 2.8, అమరావతిలో 12.4, పెదకూరపాడులో 4.0, సత్తెనపల్లిలో 5.0, రాజుపాలెంలో 1.8, నకరికల్లులో 6.8, బొల్లాపల్లిలో 6.2, వినుకొండలో 2.2 మి. మీ వర్షం కురిసింది. నూజెండ్ల, శావల్యాపురం మండలాల్లో 2.0 మి.మీ చొప్పున, ఈపూరులో 1.4, రొంపిచర్లలో 12.2, నరసరావుపేటలో 16.8, ముప్పాళ్లలో 24.6, నాదెండ్లలో 11.4, చిలకలూరిపేటలో 12.6, యడ్లపాడులో 14.6 మి.మీ వర్షం పడింది.



మాచర్ల పట్టణంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కృష్ణానదిలో పెరిగిన వరద ప్రవాహం



రామాపురంలో కృష్ణానది ప్రవాహం పరిశీలిస్తున్న తహసీల్దార్ కుటుంబరావు

దాచేపల్లి: కృష్ణానదిలో వరద నీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల నుంచి శుక్రవారం దిగువకు నీటిని విడుదల చేయటంతో పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కె.వి. కుటుంబరావు రామాపురం, పొందుగల, భట్రుపాలెం, తంగెడ గ్రామాల్లో పర్యటించి కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలించారు. నది ఒడ్డున నివాసం ఉంటున్న మత్స్యకారులను నదిలో మరింతగా నీటి ప్రవాహం పెరిగితే ఖాళీ చేయించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రెవెన్యూ అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం పెరగటంతో రామాపురం మత్స్యకారులు పడవలు, బోట్లు లంగర్‌వేసి నది ఒడ్డున కట్టేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాతో పాటు పలుచోట్ల మహిళలపై దాడులు దారుణం. ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకువచ్చి నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు అండగా నిలవాలి. నిందితులను కఠినంగా శిక్షించినప్పుడే మహిళలు ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వహించగలరు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల్లోనూ వైద్యులకు రక్షణ కరువైంది. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడుల్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి.

డాక్టర్ మానవి, ఎయిమ్స్



వైద్యులకు వసతులు కల్పించాలి..



జీజీహెచ్‌లో నైట్ డ్యూటీ చేసే వైద్యులకు వసతులు కల్పించాలి. రోగులకు వైద్యం అందించే సమయంలో వారి సహాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటివి నిరోధించేందుకు ఆస్పత్రుల్లో నిరంతరం పోలీసులు సిద్ధంగా ఉండాలి. అవుట్ పోస్ట్ పోలీసులు కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా దాడులు నిరోధించేందుకు కృషి చేయాలి. ఆస్పత్రిలో పనిచేసే వైద్యులకు రక్షణ పెంచాలి. ఆస్పత్రిలో సెక్యూరిటీ పటిష్టం చేయాలి.

– డాక్టర్ వై.బాలసుబ్రహ్మణ్యం, ఆర్థోపెడిక్

క్లుప్తంగా

రేపు నల్లబ్యాడ్జీలతో నిరసన

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి కాంట్రీబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెజ్జం సంపత్‌బాబు, పి.వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ విధానం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఉద్యోగి ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్ని ఏం చేస్తారో అందులో వివరణ లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎటువంటి షరతులు లేని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మరే విధమైన పద్ధతులకు అంగీకరించటం లేదని తెలిపారు. రాష్ట్రంలో సీపీఎస్ అమలు చేసిన సెప్టెంబర్ 1వ తేదీన జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు.

టెండర్లు దాఖలు చేయండి

నరసరావుపేట: జిల్లాలోని 2031 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలసంజీవిని పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఒక కిలో కందిపప్పుతో కలిపి పదార్థాల ప్యాకెట్లు అందజేసేందుకు వచ్చే నెల మూడో తేదీలోగా టెండర్లు దాఖలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే శుక్రవారం ఒక ప్రకటనలో వ్యాపారులను కోరారు. ఆసక్తి గలవారు జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ డీడీ పేరుపై రూ.5వేల డీడీ తీసి జిల్లా కలెక్టరేట్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో మూడో తేదీ మధ్యాహ్నం 2గంటల్లోగా దాఖలు చేయాలని కోరారు. మధ్యాహ్నం 5 గంటలకు ఆ టెండర్లు తెరువబడతాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 6305313833, 97055 18469లను సంప్రదించాలని సూచించారు.

డాక్యుమెంట్ రైటర్‌పై దాడి

మున్సిపల్ ఉద్యోగిపై కేసు నమోదు

నరసరావుపేటటౌన్: డాక్యుమెంట్ రైటర్‌పై దాడికి పాల్పడ్డ మున్సిపల్ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ విజయ చరణ్ శుక్రవారం తెలిపారు. ప్రకాష్‌నగర్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిల్చోని ఉన్న డాక్యుమెంట్ రైటర్ సిద్దు అనంత నాగబ్రహ్మచారికి, మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి సంగమేశ్వరరావుకు మధ్య రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వ్యవహారంలో వివాదం జరిగింది. ఈ క్రమంలో డాక్యుమెంట్ రైటర్‌పై సంగమేశ్వరరావు దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగుల హక్కులను కాలరాయొద్దు

- అలాంటి విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలి
- పాత పెన్షన్ విధానం అమలుకు యూటీఎఫ్ డిమాండ్



రేపల్లెలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రేపల్లె రూరల్: పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవీ సుబ్రహ్మణ్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇందులో ఎంవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఉద్యోగుల పట్ల కేంద్రం ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ.. కోట్లాది మంది కార్మికుల హక్కు అయిన పెన్షన్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంలో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నాయని ఆరోపించారు. నేడు కేంద్ర ప్రభుత్వం సైతం యూపీఎస్ పేరుతో రాష్ట్రాలపై బలవంతంగా ఉద్యోగులకు నష్టం చేసే విధానం రుద్దడం కుట్రపూరితం అన్నారు. దీనిపై ఉద్యోగ, కార్మిక సంఘాలు దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.సుబ్బారావు, రాజభూషణం, రాజేష్, జి.రవీంద్ర, రత్నబాబు, లక్ష్మణుడు, ఏలియా, వంగర శ్రీనివాసరావు, నాగరాజు, డి.శ్రీనివాసరావు, రహమతుల్లా, డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు కె.వి.లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాల్సిందే...



అద్దంకి రూరల్ ప్రాంతంలో నిరసన తెలుపుతున్న నేతలు

అద్దంకి రూరల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం బాబురావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేయాలన్నారు. ఓపీఎస్ అమలు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. అనంతరం ఆర్ఐ శంకరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి మండల అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి బి. పూర్ణ చంద్రరావు, కోశాధికారి దామా రామాంజనేయులు, ముండ్లమూరు మండల ప్రధాన కార్యదర్శి గోగుల కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు సర్వేశ్వరరావు, బీవీ రత్నం, సాంబశివరావు, జాషువా, మస్తాన్‌వలి, వి. వెంకటేశ్వర్లు, వి. ఆంజనేయులు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక కోటా



ఎన్‌సీసీ ఎంపికకు హాజరైన విద్యార్థులతో ఆర్మీ అధికారులు

నరసరావుపేటరూరల్: ఎన్‌సీసీలో చేరే క్యాడెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక కోటా ఉంటుందని 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీలో చేరే మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఎంపికలు నిర్వహించారు. కల్నల్ సునీల్‌గౌతమ్, చీరాల ఆర్మీ యూనిట్ సుబేదార్‌లు అవతార్ సింగ్, రన్వీర్‌సింగ్, హవల్దార్లు నారాయణ జీనా, వీరేష్‌లు ఎంపికలో పాల్గొన్నారు. మొదటి సంవత్సరం చదువుతున్న 400మంది విద్యార్థులు ఎంపికలకు హాజరయ్యారు. ఆర్మీ అధికారులు వీరికి శారీరక పరీక్షలు నిర్వహించి 90 మందిని ఎంపికచేశారు. కల్నల్ సునీల్‌గౌతమ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు డిఫెన్స్ ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా, బోనస్ మార్కులు కేటాయిస్తారని వివరించారు. ఎన్‌సీసీలో చేరడం వలన కార్పొరేట్ కంపెనీస్‌కు అవసరమైన పర్సనాలిటీ డెవలప్‌మెంట్, సమయపాలన, టీం వర్క్, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సీసీ ఆఫీసర్ మేడికొండ రాజేష్‌లు పాల్గొన్నారు.

సురక్షిత నీటి సరఫరాయే జలజీవన్ లక్ష్యం



కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ రంగారావు

చీరాల: ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని సరఫరా చేయడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని జిల్లా కో ఆర్డినేటర్ టి.రంగారావు అన్నారు. శుక్రవారం వేటపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఇందులో టి.రంగారావు మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్‌లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ ద్వారా ఒక్కొక్కరికి 55 లీటర్ల వంతున తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమలు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. జలజీవన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పి.తేజ్ సంగీత్ మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడాలని కోరారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల వర్షాలు కురుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ ఎఫ్రాయిం, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వాసవీమాతకు శ్రావణ సారె సమర్పణ



అలంకరణలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి

భట్టిప్రోలు: భట్టిప్రోలు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ సారె మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌కు 108 చీరలతో అలంకారం చేశారు. ఉదయం అమ్మవారి చెట్టు నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. పెండ్లికుల గోత్రికులు మొదటి సారె సమర్పించారు. పలు ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని నేత్రపర్వంగా అలంకరించారు. తర్వాత భక్తులు సారె సమర్పించి, దర్శించుకున్నారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు.

రేపు సత్తెనపల్లిలో ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: మెన్ అండ్ ఉమెన్ ఫుట్‌బాల్ పల్నాడు జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలు(ఫారం5) రెండు కాపీలు వెంట తెచ్చుకోవాలన్నారు.

రేపు జిల్లా భజన మండళ్ల సమ్మేళనం

నరసరావుపేట ఈస్ట్: విశ్వహిందూ మహా సంఘ్ భారత్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా స్థాయి హైందవ ధర్మ భజన మండలి సమ్మేళనం ఆదివారం భువనచంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్టు సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 36 భజన మండలి సభ్యులు హాజరవుతారని వివరించారు. హిందూ ధర్మ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై సమ్మేళనంలో ప్రణాళిక రూపొందిస్తామన్నారు. జిల్లా పరిధిలోని భజన మండలిల సభ్యులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బస్సులను ఇతర అవసరాలకు వాడరాదు

డీటీసీ షేక్ కరీం



నెహ్రూనగర్: విద్యా సంస్థల బస్సులను కేవలం స్కూల్, కాలేజీ విద్యార్థుల రవాణా కోసమే వాడాలని డీటీసీ షేక్ కరీం స్పష్టం చేశారు. స్కూల్, కాలేజీ బస్సుల యాజమాన్యాలతో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అనధికారంగా వాహనాలను ఇతర కార్యక్రమాలకు వాడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అటువంటి వాహనాలపై కేసులు నమోదు చేసి కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులకు వర్తించే ట్యాక్సులు వసూలు చేస్తామని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా తిరిగే బస్సులను సీజ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీఓ గోపాల్, ఎంవీఐలు మల్లీశ్వరి, గంగాధర్, ప్రసాద్, సౌజన్య పాల్గొన్నారు.

రాష్ట్ర కాపు నాడు జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు




చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా చీరాలకు చెందిన లక్కాకుల నాగేశ్వరరావు నియమితులయ్యారు. సంవత్సరం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని జాతీయ అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు ఇచ్చారని పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావులు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కాలువలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



కొల్లూరు: అనారోగ్య సమస్యల కారణంగా ఓ వృద్ధురాలు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు ఎస్సీ ప్రాంతానికి చెందిన చొప్పర కరుణ (73) కొద్ది రోజుల క్రితం పక్షవాతానికి గురైంది. ఆమె భర్త గతంలోనే మరణించారు. ఇరువురు కుమార్తెల్లో ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు దుబాయిలో ఉంటున్నారు. వీరిలో ఒకరు ఇటీవల కొల్లూరులో ఉంటున్న కరుణ సోదరి మేరీకుమారికి నగదు పంపారు. దాంతో వైద్యం చేయించాలని కోరడంతో తెనాలి వైద్యశాలలో చికిత్స చేయించారు. తర్వాత కొల్లూరుకు తీసుకొచ్చారు. ఇటీవల మేరీకుమారి కిందపడి చేతికి గాయం కావడంతో తెనాలిలో చికిత్స పొందుతున్నారు. కరుణ ఒంటరిగా ఇంట్లో ఉంటోంది. మూడు రోజుల క్రితం పక్కింటి వద్ద కూర్చున్న ఆమె ఆ సాయంత్రం నుంచి అదృశ్యమైంది. ఇరుగుపొరుగు వారు, బంధువులు వెతకగా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం వారి ఇంటి సమీపంలో ప్రవహించే దోనేపూడి పంట కాలువలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐలు అర్జున్, వెంకటేశ్వరరావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆమెది ఆత్మహత్యగా భావిస్తూ మేరీకుమారి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నడిరోడ్డుపై కారు దగ్ధం



కొల్లూరు: ప్రయాణిస్తున్న కారులో ఉన్నట్టుండి దట్టమైన పొగలు వ్యాపించి మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కారు యజమాని కథనం మేరకు... వేమూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన పాముల అనిల్ తన చిన్నారి కుమార్తె, మరో యువకుడితో కొల్లూరుకు కారులో పయనమయ్యారు. మండలంలోని మొసలిపాడు దాటిన అనంతరం తెనాలి–రేపల్లె ప్రధాన రహదారిపై క్రాప–రావికంపాడు అడ్డరోడ్డు సమీపంలోకి వచ్చారు. అదే సమయంలో ఇంజిన్ నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చి కారు మొత్తం వ్యాపిస్తుండటంతో అప్రమత్తం అయ్యారు. వెంటనే కారును నిలిపేశారు. యువకుడితో కలిసి ఇంజిన్‌ను పరిశీలించేందుకు ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కారులోని కుమార్తెను బయటకు దింపే సమయానికే మొత్తం మంటలు వ్యాపించాయి. అటుగా వస్తున్న వారు మంటలను అదుపు చేసేందుకు సమీపంలో ఉన్న గృహంలో నుంచి బకెట్‌తో నీళ్లు పోసినప్పటికీ కారు మొత్తం అగ్నికి ఆహుతైంది. వాహనాల రాకపోకలు కాసేపు నిలిచిపోయాయి.

యార్డులో 51,315 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 44,587 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 51,315 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,619 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అలవెన్సుల విడుదలకు డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు

బాపట్ల: ఆర్టీసీ ఉద్యోగులకు అలవెన్సులను వెంటనే విడుదల చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షులు అన్నం రామోహన్‌రావు కోరారు. బాపట్ల డిపో వద్ద శుక్రవారం ఈ మేరకు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు అందరికీ డ్యూటీతో కూడిన అలవెన్సులను పునరుద్ధరించాలన్నారు. జీవో నెంబరు 114లోని అలవెన్సులను వెంటనే అమలు చేయాలని కోరారు. సర్వీస్‌లో చనిపోయిన ఉద్యోగులకు అంత్యక్రియలకు రూ.25 వేలు ట్రెజరీ నుంచి చెల్లించాలని కోరారు. మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ బిల్లులు చెల్లించాలన్నారు. ధర్నాలో డిపో కార్యదర్శి వై. శ్రీనివాసరావు, గ్యారేజీ కార్యదర్శి శివారెడ్డి, అధ్యక్షులు మాధవ రాజు, జిల్లా కమిటీ మెంబర్ ఆశా బాబు, సీనియర్ నాయకులు గాంధీ, చిట్టిబాబు, రత్నం, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇక ఎఫ్‌పీవోల ద్వారానే పథకాల అమలు



మాట్లాడుతున్న రవి కుమార్

గొరిగపూడి(భట్టిప్రోలు): రానున్న కాలంలో రైతులకు సంబంధించి ఇకపై ఎటువంటి ప్రభుత్వ పథకాలైనా రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవోల) ద్వారానే అమలు చేయనున్నట్లు నాబార్డ్ డీడీఎం జె. రవి కుమార్ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం గొరిగపూడి కమ్యూనిటీ హాల్‌లో నాబార్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం సెర్ప్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఎఫ్‌పీవోల ద్వారా లైసెన్సుల మంజూరు, అనుమతుల డ్రైవ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ భట్టిప్రోలు మండలం గొరిగపూడిలో ఇందుకు సంబంధించి ఒక కంపెనీ ఏర్పాటైందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాపట్ల జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వివిధ పథకాలను వివరించారు. ఎల్‌డీఎం శివకృష్ణ మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా అందించే రుణాలు కూడా ఎఫ్‌పీవోల ద్వారానే ఇకపై అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ డీడీ పద్మావతి, సెర్ప్ సంస్థ ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నారాయణను కలిసిన వీఐటీ ఫౌండర్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న విశ్వనాథన్

తాడికొండ: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రి పొంగూరు నారాయణను శుక్రవారం వీఐటీ ఫౌండర్ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యనందించేందుకు తమ వర్సిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, వీసీ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి ఉన్నారు.

సరైన పత్రాలు లేకపోతే వాహనాలు సీజ్

అదనపు ఎస్పీ శ్రీనివాసరావు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న శ్రీనివాసరావు

తాడేపల్లి రూరల్: సరైన పత్రాలు లేని వాహనాల్ని సీజ్ చేస్తామని గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణం, మహానాడులో తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 100 మంది సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వంద వాహనాల వరకు సరైన పత్రాలు లేనట్లు గుర్తించి యజమానులను అక్కడకు పిలిపించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మహానాడులో రహదారులన్నీ బారికేడ్లతో మూసివేసి కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇప్పుడు తనిఖీ చేసిన వాహనాలు మరలా పట్టుబడితే వాటిని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా సస్పెక్ట్ షీటర్స్, రౌడీ షీటర్స్ వివరాల సేకరణతో పాటు వారి ప్రస్తుత కదలికలు ప్రజల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నేరాలు చేసి ఇక్కడ తలదాచుకుంటున్నారా? అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించామని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు, మంగళగిరి సీఐ వినోద్ కుమార్, తాడేపల్లి యస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.